క్లుప్తంగా

నేత్ర శస్త్రచికిత్సలకు 20 మంది ఎంపిక


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

మాకవరపాలెం: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా బూరుగుపాలెంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 50 మంది కంటి సమస్యలతో బాధపడుతున్నవారు హాజరయ్యారు. వీరందరికీ విశాఖ శంకర్ ఫౌండేషన్ వైద్యులు పరీక్షించారు. 20 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వీరిని విశాఖ తరలించి ఆపరేషన్లు చేస్తామని ప్రోగ్రాం కో ఆర్డినేటర్ అరుణ్ తెలిపారు. సర్పంచ్ వొబ్బలరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.

చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు


వివిధ రకాల బొమ్మలు వేసిన చిన్నారులు

రావికమతం: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం కొత్తకోట శాఖా గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మూడు, నాలుగు తరగతుల చిన్నారులు పాల్గొని ఉత్సాహంగా వివిధ రకాల చిత్రాలను వేశారు. జాతీయ పతాకం, సూర్యుడు, టామ్అండ్ జెర్రీ, సముద్రంపై పయనించే ఓడ వంటి బొమ్మలు వేసి ఆశ్చర్యపరిచారు. వాటిలో ప్రథమ, ద్వితీయ విజేతలను ఎంపిక చేసి వచ్చే నెల 11న బహుమతులు ప్రదానం చేస్తామని, ఇటువంటి కార్యక్రమాలు ద్వారా పిల్లల్లో దాగున్న సృజనాత్మకత బయటపడుతోందని గ్రంథపాలకురాలు వరహామణి తెలిపారు.

మహిళల భద్రత కోసం దిశ యాప్


అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీసు కుసుమశ్రీ కుమారి

మాడుగుల రూరల్: మహిళల భద్రత కోసం దిశ యాప్ వినియోగించుకోవాలని కె.జె.పురం -2 గ్రామ సచివాలయం మహిళా పోలీసు జి. కుసుమశ్రీ కుమారి తెలిపారు. మంగళవారం ఆమె కె.జె.పురం హౌసింగ్ కాలనీలో మహిళలకు అవగాహన కల్పించారు. ఆపద సమయంలో ఆయుధం దిశ యాప్ మాత్రమేనని, ప్రతి మహిళ తమ స్మార్టు ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. సైబర్ క్రైమ్ గురించి అవగాహన కల్పించారు.

ప్రతిభ వెలికితీత


విద్యార్థులతో బొమ్మలు వేయిస్తున్న పద్మావతి

కె.కోటపాడు: చిత్రలేఖనం పోటీలతో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని గ్రంథపాలకురాలు ఎం.పద్మావతి అన్నారు. చౌడువాడ శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. 14 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ చూపారు. వీరిలో విజేతలకు వేసవి విజ్ఞాన శిబిరాల ముగింపు రోజున బహుమతులు ప్రదానం చేస్తామని పద్మావతి తెలిపారు.

ఘనంగా పరదేశమ్మ పండగ


పోతురాజుబాబు వద్ద పూజలు చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి

చీడికాడ: తురువోలులో పరదేశమ్మ పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పోతురాజుబాబుకు మొక్కులు చెల్లించుకున్నారు. దేవరాపల్లి, చీడికాడ జెడ్పీటీసీలు కర్రి సత్యం, లాలం శారదాజానకీరాం, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
✆ 9966329167, 9912440601
సాక్షి

పేదలకు చేరువగా ప్రభుత్వ వైద్యం


రూ.25 లక్షలతో సీసీరోడ్డు వేసి మరమ్మతులు పూర్తి చేసుకున్న గునుపూడి పీహెచ్‌సీ


నాతవరం పీహెచ్‌సీలో ప్రారంభానికి సిద్ధంగా అదనపు భవనం

- పీహెచ్‌సీల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు
- నియోజకవర్గంలో రూ.5.50 కోట్లతో మౌలిక సదుపాయాలు
- నాతవరం పీహెచ్‌సీకి అదనపు భవనం సిద్ధం

నాతవరం: రాష్ట్రం ప్రభుత్వం పేదలకు ప్రభుత్వ వైద్యాన్ని మరింత చేరువ చేసేలా ప్రభుత్వాస్పత్రులను పటిష్టం చేస్తోంది. ఈ నేపథ్యంలో ఏళ్ల తరబడి వెంటాడుతున్న పీహెచ్‌సీల్లో వసతి సమస్యలను పరిష్కరించేందుకు దృష్టి సారించింది. ఈ మేరకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పీహెచ్‌సీల అభివృద్ధికి రూ.5.50 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు అదనపు భవనాలు నిర్మిస్తున్నారు. నాతవరంలో 60 ఏళ్ల క్రితం నిర్మించిన పీహెచ్‌సీలో నాలుగు పడకలతోనే నేటికీ కాలం వెళ్లదీస్తున్నారు. గత టీడీపీ పాలకులు పీహెచ్‌సీ స్థాయి పెంచకుండా వసతి సదుపాయాలు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం చేయడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక పీహెచ్‌సీలు అభివృద్ధిపై దృష్టి సారించారు. నాతవరం పీహెచ్‌సీలో రూ.1.65 కోట్లతో నిర్మించిన అదనపు భవనం ప్రారంభానికి సిద్ధమైంది. గునుపూడి పీహెచ్‌సీలో రూ.25 లక్షలతో రోగులకు కావాల్సిన సదుపాయాలు కల్పించారు. గొలుగొండ మండలంలో కృష్ణదేవిపేట, గొలుగొండ పీహెచ్‌సీలకు రూ.2 కోట్లతో మరమ్మతులు, ప్రహరీ నిర్మాణం వంటి పనులు చేపట్టారు. గతంలో ప్రహరీ లేక విష సర్పాలు లోపలకు వస్తుండేవి. రాత్రిళ్లు అల్లరి మూకలు పీహెచ్‌సీ ఆవరణలో అధ్వానంగా తయారు చేసేవారు. మాకవరపాలెం మండలంలో బూరుగుపాలెం, మాకవరపాలెం పీహెచ్‌సీని రోగులకు అవసరమైన విధంగా తీర్చిదిద్దారు. నర్సీపట్నం మండలం వేములపూడి పీహెచ్‌సీలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. పీహెచ్‌సీలో మౌలిక సదుపాయాల కల్పనకు ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ విశేష కృషి చేశారు. ప్రభుత్వం పీహెచ్‌సీలను అభివృద్ధి చేయడంతోపాటు ఇద్దరు వైద్యుల చొప్పున నియమించడంతో రోగులకు సకాలంలో సేవలందుతున్నాయి.

చీడిగుమ్మలలో కొత్త పీహెచ్‌సీ మంజూరు

గొలుగొండ మండలం చీడిగుమ్మలలో జనాభా ప్రాతిపాదికన ప్రభుత్వం కొత్తగా పీహెచ్‌సీ మంజూరు చేసింది. నిధులు విడుదల చేయడంతో త్వరలో నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సకాలంలో నిర్మాణం పూర్తి చేసి వైద్య సేవలు ప్రారంభిస్తే, ఈ ప్రాంత రోగులకు అన్ని విధాలుగా ఉపయోగకరంగా ఉంటుంది.

రోగులకు సదుపాయాలు



నియోజకవర్గంలో పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతి సదుపాయాలు ప్రభుత్వం కల్పించింది. దానిని దృష్టిలో పెట్టుకొని రోగులకు మెరుగైన వైద్యం చేసేలా వైద్యాధికారులకు ప్రత్యేక సూచనలు చేశాం.

– వీరాజ్యోతి డిప్యూటీ డీఎంహెచ్‌వో, నర్సీపట్నం

వసతి సమస్య తీరుతుంది



నాతవరం పీహెచ్‌సీలో వసతి సమస్యతో ఏళ్లతరబడి బాధలు పడుతున్నాం. పీహెచ్‌సీ ఏర్పాటు సమయంలో సమకూర్చిన నాలుగు మంచాలతోనే కాలం వెళ్లదీస్తున్నాం. కొత్తగా నిర్మించిన అదనపు భవనం ప్రారంభిస్తే రోగులకు ఉద్యోగులకు వసతి సమస్య తీరుతుంది. ప్రస్తుతం వర్షం కురిసినా తీవ్రంగా ఎండ కాచినా వసతి సమస్య వెంటాడుతోంది.

– ప్రసన్న, వైద్యాధికారి, నాతవరం పీహెచ్‌సీ

ప్రజా సంక్షేమానికి నిరంతర కృషి

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- ఖండివరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం


ఖండివరం ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు


వృద్ధురాలితో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

చీడికాడ: ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఖండివరంలో ఇంటింటికి తిరిగారు. తొలుత బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సీ, యాదవ, రజక కాలనీ ల్లో ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులను, దివ్యాంగులను పలకరించి సంక్షేమ లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఎన్నికల హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఇంటి ముంగిటకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. జల జీవన్ మిషన్‌లో భాగంగా రూ.1.70 కోట్లతో 40 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకు నిర్మించి 1,070 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇస్తామన్నారు. వీటిలో 640 కుళాయిలను ఇప్పటికే వేశారన్నా రు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులతో ముచ్చటించారు. పౌష్టికాహారం పరిశీలించారు. ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు లాలం శారదాజానకీరామ్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, పార్టీ సీనియర్ నాయకుడు సుంకర శ్రీను, విశాఖ డెయిరీ డైరెక్టరు శీరంరెడ్డి సూర్యనారాయణ, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ సూర్యనారాయణ, దేవరాపల్లి జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, గ్రామ శాఖ అధ్యక్షుడు సుంకర కొండబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం. సన్నిబాబు, వేచలపు కామేష్, ఎంపీడీవో జయప్రకాష్, తహసీల్దారు బి.వి.రాణి, మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఖండివరంలో గడప గడపకు...

ఖండివరం పంచాయతీలో రెండో రోజు బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు తెలిపారు. ఉదయం 7 గంటలకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని, సంక్షేమ పథకాలను వివరిస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

నిరుద్యోగులకు పీఎం ఉపాధి కల్పన


మాట్లాడుతున్న ఎంపీడీవో సుబ్బలక్ష్మి

దేవరాపల్లి: ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకాన్ని (పీఎంఈజీపీ) నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి తెలిపారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో వీవోఏలకు పీఎంఈజీపీ, ముద్రలోన్, ఖాదా బండార్ రుణాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పరిశ్రమలు, వస్తువుల తయారీ యూనిట్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఈ పథకం ద్వారా అందిస్తున్న రాయితీలు, అభ్యర్థుల అర్హతలు, దరఖాస్తు చేసుకునే విధానం తదితర అంశాలపై ఆమె వివరించారు. వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఎస్. ప్రభాకర్, హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ భవ్యతేజ, ఏవో వై. కాంతమ్మ, ఏపీవో డి. చంద్రకళ, ఎం. అలమండ పశువైద్యాధికారి కె.మంజుషారాణి, యూకో బ్యాంక్ మేనేజర్ జగదీష్, ఏపీజీవీబీ ఫీల్డ్ ఆఫీసర్ శంకర్ పాల్గొన్నారు.

సీసీ ప్లాట్‌ఫాం నిర్మాణానికి శంకుస్థాపన


సన్యాసమ్మ ఆలయం వద్ద శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి

దేవరాపల్లి: స్థానిక సన్యాసమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో సిమెంట్ ప్లాట్‌ఫాం నిర్మాణానికి ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి మంగళవారం శంకుస్థాపన చేశారు. దేవరాపల్లి ప్రజల ఆరాధ్యదైవం సన్యాసమ్మ అమ్మవారి నెల రోజుల పండగ నేపథ్యంలో ఆలయ ఆవరణలో సిమెంట్ ప్లాట్ ఫాం, రక్షణ గోడ నిర్మాణానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు రూ.15 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో వచ్చే నెల 6వ తేదీలోగా నిర్మాణ పనులను పూర్తి చేయనున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎంకు ఎంపీపీ, గ్రామ పెద్దలు, కృతజ్ఞతలు తెలియజేశారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, కల్లుగీత కార్పొరేషన్ డైరెక్టర్ సిమ్మ అప్పన్న, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి లలితానాయుడు, గుండు రాంబాబు, దీవి శంకర్, గొర్లె సన్యాసినాయుడు, వాలేటి నాగరాజు, వెత్సా రమేష్, కె.వి.రమణ, గుల్లేపల్లి మురళీకృష్ణ, సోమిరెడ్డి పేరునాయుడు పాల్గొన్నారు.

ఘనంగా మోదకొండమ్మ పండగ


బంగారుమెట్టలో ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

బుచ్చెయ్యపేట: బంగారుమెట్టలో మంగళవారం మోదకొండమ్మ పండగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి సాయం రమేష్, సర్పంచ్ మేరుగు కుమారి బాబూరావు, సచివాలయ కన్వీనర్ యెనుముల వాసు తదితర గ్రామ పెద్దల సమక్షంలో గ్రామం సుభిక్షంగా ఉండాలని, వర్షాలు సమృగా కురవాలని, గ్రామస్తులంతా సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. తొలుత డప్పులు, వాయిద్యాలతో ఊరేగింపుగా అన్ని వీధుల్లో తిరిగారు. డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, ఏబీపురం సర్పంచ్ తమరాన శ్రీను, నాయకులు దొండా కుమార్, సాయం వెంకటేష్ పాల్గొన్నారు.

వారానికి ఒక పశు విజ్ఞాన బడి


రికార్డులు పరిశీలిస్తున్న ఏడీ చిట్టినాయుడు

మాడుగుల: పశు వైద్యశాల పరిధిలో వారానికి ఒక పశు విజ్ఞాన బడి అమలు చేయాలని ఏడీ వి. చిట్టినాయుడు తెలిపారు. మంగళవారం ఆయన ఎం. కోడూరు పశువైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. 75 శాతం కాకిజొన్న గడ్డి విత్తనాలు, 1962 పశు అంబులెన్స్, మిశ్రమదాణా గురించి రైతులకు వివరించాలని పశువైద్యాకారి అరుణకు సూచించారు. ఆర్బీకేలను సందర్శించి పశువైద్య సిబ్బంది పనితీరు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

‘జగనన్నకు చెబుదాం’పై అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు

- వచ్చే నెలాఖరుకు రెండో దఫా భూ సర్వే పూర్తి
- అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ


గొండుపాలెంలో స్పందన అర్జీపై విచారణ నిర్వహిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ, తహసీల్దార్ రమేష్‌బాబు

దేవరాపల్లి: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ‘జగనన్నకు చెబుదాం’ కార్యక్రమం పట్ల అలసత్వం ప్రదర్శించే అధికారులపై చర్యలు తప్పవని అనకాపల్లి ఆర్డీవో ఎ.జి. చిన్నికృష్ణ హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారం, సమగ్ర భూ రీసర్వేపైన స్థానిక తహసీల్దార్ ఎం. లక్ష్మిని ఆరా తీశారు. జగనన్నకు చెబుదాం ఫిర్యాదుల పట్ల తక్షణమే స్పందించి వాటి పరిష్కారానికి తొలి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అనకాపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని తొలి విడతలో 93 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి, రైతులకు భూ హక్కు పత్రాలు అందించడంతోపాటు సర్వే రాళ్లు వేయించామన్నారు. రెండో దఫా జూన్ కల్లా పూర్తి చేస్తామన్నారు. ఇప్పటి వరకు 109 గ్రామాలకుగాను 90 గ్రామాల్లో పూర్తి చేశామన్నారు. సర్వే సమయంలో భూ యజ మాని తప్పనిసరిగా హాజరై భూమి రికార్డులు, పాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్ జెరాక్స్‌లతోపాటు ఫొటోను సర్వే సిబ్బందికి అందజేయాలన్నారు.

కె.కోటపాడులో భూసర్వే ప్రగతిని తెలుసుకున్న ఆర్డీవో

కె.కోటపాడు: సమగ్ర భూసర్వేతో రైతులకు భావితరాలకు మేలు కలగనున్నట్లు అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెండో విడత రీసర్వే చేస్తున్న గ్రామాల వివరాలను, కంప్యూటర్‌లో నమోదు చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. మొదటి విడత రీసర్వేను మండలంలో ఏడు గ్రామాల్లో పూర్తి చేసినట్లు తహసీల్దార్ జె.రమేష్‌బాబు వివరించారు. ఆయా గ్రామాల్లో 3,720 మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేశామన్నారు.

స్పందన అర్జీపై గొండుపాలెంలో క్షేత్రస్థాయి విచారణ

స్పందన అర్జీపై గొండుపాలెంలో ఆర్డీవో విచారణ నిర్వహించారు. గ్రామంలో అనధికార ఇటుక బట్టీల నుంచి వెలువడుతున్న వాతావరణ కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నట్లు బడే నర్సింగరావు స్పందనలో ఫిర్యాదు చేశాడు. దీంతో ఇటుక బట్టీ నిర్వాహకుడు బండారు నర్సింహమూర్తి, ఫిర్యాదు దారుడితో వేర్వేరుగా మాట్లాడారు.

20లోగా పెన్షనర్లు ఈ-కేవైసీ చేసుకోవాలి


సహాయ ఖజానాధికారి కావ్య

నర్సీపట్నం: ప్రభుత్వ పెన్షనర్లు విధిగా ఈ- కేవైసీ చేయించుకోవాలని సహాయ ఖజానాధికారి వి.కావ్య తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగ పెన్షనర్లు సీఎంఎఫ్ఎస్‌కు ఆధార్ లింక్ చేసుకోవాలన్నారు. దీనికి ఈ నెల 20వ తేదీ వరకు గడువు ఉందన్నారు. ఆధార్ కార్డు, జీఎఫ్ఎంఎస్ నెంబర్, ఆధార్ అనుసంధానంతో ఫోన్ నెంబరు సమర్పించి ప్రక్రియను పూర్తి చేసుకోవాలన్నారు. అనారోగ్య పెన్షనర్లకు ఇంటి వద్దకే వచ్చి ఈ-కేవైసీ చేస్తామన్నారు.

ఉత్సాహంగా ఫేర్‌వెల్ వేడుకలు



ఫేర్‌వెల్ వేడుకల్లో డాన్స్ చేస్తున్న విద్యార్థినులు

నర్సీపట్నం: బి.ఆర్.అగ్రికల్చర్, ఫిషరీ, వెటర్నరీ కళాశాల ఫేర్‌వెల్ వేడుకలను మంగళవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడు హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అగ్రికల్చర్, వెటర్నరీ కోర్సులకు ఎంతో ఆదరణ ఉందన్నారు. కళాశాల యాజ మాన్యం కొత్త కోర్సులు తీసుకు వచ్చి గ్రామీణ విద్యార్థుల ఉద్యోగ కల్పనకు బాటలు వేస్తుందన్నారు. ప్రభుత్వం వసతి దీవెన, విద్యా దీవెన పథకాల ద్వారా విద్యార్థులకు ఆర్థిక తోడ్పాటునందిస్తుందన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. దుర్గామల్లేశ్వరస్వామి దేవాలయం చైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, కళాశాల వెటర్నరీ ప్రిన్సిపాల్ సురేష్, అగ్రికల్చర్ ప్రిన్సిపాల్ సుధీర్, ఫిషరీ ప్రిన్సిపాల్ రమేష్ పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ మరియు సర్టిఫికేట్స్ పోయినవి

పంతం జై సాయికృప S/o అప్పలనారాయణ, వయస్సు 27 సం॥, అనకాపల్లి జిల్లా మాకవరపాలెం (మం) తామరం గ్రామం కాపురస్తుడను నేను 03-05-2023న తామరం నుండి నర్సీపట్నం బస్సులో వెళ్తుండగా నా యొక్క సర్టిఫికేట్స్ (10th, Inter, B.Tech) మరియు పాస్‌పోర్ట్ పోయినవి. ఎవరికైనా దొరికిన వారు ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు.

ఫోన్ : 9440673141

రోడ్డు పనులకు భూమిపూజ


రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్ లోవరాజు

రావికమతం: కొత్తకోట మేజర్ పంచాయతీలో రోడ్డు పనులకు సర్పంచ్ కోన లోవరాజు మంగళవారం భూమిపూజ చేశారు. ఇక్కడ ఒకటో వార్డు నుంచి నాల్గో వార్డు వరకు ప్రజలు మార్కెట్‌కు వచ్చేందుకు వీలుగా గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి రూ.4.50 లక్షలతో రహదారి నిర్మాణాన్ని చేపట్టేందుకు పంచాయతీ తీర్మానించింది. ఉప సర్పంచ్ పందల దేవా, ఎంపీటీసీ–2 పూడి దేవ, మాజీ ఉప సర్పంచ్ కేదారిశెట్టి గున్నాజీరావు, నాయకుడు సత్యనారాయణ, వీఆర్పీ బాబూరావు పాల్గొన్నారు.





దోమల నివారణతో వ్యాధులు దూరం


మల్లంపాలెంలోని ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

మాడుగుల రూరల్: నిల్వ నీటిలో దోమలు చేరి, వివిధ రకాల వ్యాధులకు కారకమవుతున్నాయని, వాటి నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చోడవరం మలేరియా సబ్ యూనిట్ అధికారి కె. మురళీధర్ తెలిపారు. జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని కె.జె.పురంలో వైద్య సిబ్బంది, వలంటీర్లు, ఆశ కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ సచివాలయంలో అవగాహన కల్పించారు. దోమల ద్వారా వచ్చే మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడు వాపు, బోద వ్యాధి, వంటి వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంచి నీటి నిల్వల్లో పెరిగే అనాఫిలిస్ దోమ మలేరియా వ్యాధి ని వ్యాపింపజేస్తుందన్నారు. కార్యక్రమంలో కె.జె.పురం పీహెచ్‌సీ పీహెచ్ఎన్ ఇంది ర, ఆరోగ్య పర్యవేక్షకుడు వెంకట్రావు, ఏఎన్ఎం శ్రావణి పాల్గొన్నారు. ఎం. కోటపాడు, వీరనారాయణం, తాటిపర్తి, ఎం. కోడూరు, తదితర గ్రామాల్లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు.

కె.కోటపాడు: డెంగ్యూ వ్యాధి సోకకుండా ప్రజలు ముందస్తుగా అవగాహన పెంచుకోవాలని చౌడువాడ పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ బి.రాము, హెల్త్ అసిస్టెంట్ డీఎస్ఏ న్.రాజు తెలిపారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం మల్లంపాలెంలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో వారం రోజులకు పైబడి మురుగు ఉండకుండా ప్రజలు జాగ్రత్తలను తీసుకోవాలని తెలిపారు. మురుగునీటిలో దోమలు వృద్ధి చెందడంతోపాటు దోమకాటు బారిన పడి ప్రజలు డెంగ్యూ వంటి ప్రమాదకర వ్యాధుల బారిన పడే పరిస్థితి ఉంటుందన్నారు. ప్రజలు ప్రతీ శుక్రవారం ఫ్రై డే–డ్రై డేగా గుర్తించి మురుగు సమస్య లేకుండా చర్యలను చేపట్టడం ద్వారా వ్యాధిని రాకుండా చర్యలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. హెచ్‌వీ సన్యాసమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ మాధవి పాల్గొన్నారు.

దేవరాపల్లి: డెంగ్యూ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారి ఎస్.లలిత తెలిపారు. ప్రపంచ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పీహెచ్‌సీ నుంచి ప్రధాన రోడ్డు వరకు సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఇంటి పరిసరాల్లో దోమల వ్యాప్తి చెందకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు పుష్పరాజు, వెంకటలక్ష్మి, ఫార్మాసిస్టు అల్లు సత్యమూర్తి, ఏఎన్ఎం సత్యవతి పాల్గొన్నారు.